
సాక్షి
గుంటూరు
సోమవారం, 21, ఆగస్టు, 2023



గుడి పునర్నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి గుడికి అయ్యప్ప గుడి కమిటీ చైర్మన్ కె.గోపి దంపతులు రూ.5 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే గోపిరెడ్డి చేతుల మీదగా అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కొవ్వూరుకు చెందిన ఏవీజీజీ పవన్ కౌశిక్ కుటుంబం రూ.లక్ష విరాళాన్ని అందజేసింది.

పల్లెలు అధికారపక్షమే

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల విజయ దుందుభి
- పల్నాడు జిల్లాలో రెండు సర్పంచులు, 33 వార్డులు కైవసం
- గుంటూరు జిల్లాలో 27 వార్డుల్లో 15 స్థానాల్లో పాగా
- పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం



క్రోసూరు మండలం హసనాబాద్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణుల విజయోత్సవం

నరసరావుపేట: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్లెలు అధికార పక్షానికి జైకొట్టాయి. సంక్షేమ సర్కారుకు మద్దతుగా నిలిచాయి. సర్పంచులు, వార్డు మెంబర్ల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. పల్నాడు జిల్లాలో మొత్తం రెండు సర్పంచులు, 48 వార్డులకు పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నరసరావుపేట, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని రొంపిచర్ల, క్రోసూరు మండలాల్లో రామిరెడ్డిపాలెం, పెరికపాడు గ్రామాల్లో రెండు సర్పంచు పదవులకు ప్రత్యర్థులెవరూ పోటీకి నిలబడకపోవటంతో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. నరసరావుపేట, మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో దాదాపుగా మొత్తం వార్డు స్థానాలను అధికారపక్షం మద్దతుదారులు గెలుచుకోగా, సత్తెనపల్లి, వినుకొండ, పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో మేజర్ స్థానాలను దక్కించుకున్నారు.

- వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లిలో రెండు వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఒక వార్డులో చెల్లని నామినేషన్ కారణంగా ఎన్నిక నిర్వహించలేదు. అంటే జిల్లా మొత్తం 47 వార్డులకు మాత్రమే ఎన్నికలు నిర్వహించారు. వినుకొండ నియోజకవర్గంలో ఐదు స్థానాలను వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. మూడు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండు వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు.
- సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం పది వార్డు స్థానాలలో తొమ్మిది ఏకగ్రీవం కాగా ఒక స్థానానికి ఎన్నిక నిర్వహించారు. మొత్తం పదింటిలో ఎనిమిది స్థానాలను వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు.



రాజనాల నాగలక్ష్మి, రామిరెడ్డిపాలెం సర్పంచ్



ఉడల శ్రీధర్, పెరికిపాడు సర్పంచ్

- చిలకలూరిపేట నియోజకవర్గంలో మొత్తం పది వార్డులకు ఏడు వార్డుల్లో అధికారపక్ష మద్దతుదారులు విజయం సాధించారు.
- నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలంలో నాలుగు వార్డులకు నోటిఫికేషన్ విడుదల కాగా, అన్నింటినీ వైఎస్సార్ సీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు.
- మాచర్ల నియోజకవర్గంలో నాలుగు స్థానాలకు నాలుగింటినీ అధికారపక్ష మద్దతుదారులు గెలిచారు.
- పెదకూరపాడు నియోజకవర్గంలోని తొమ్మిది స్థానాల్లో మూడింటిలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు.
- ఇదిలా ఉంటే గుంటూరు జిల్లాలో 27వార్డులకు నోటిఫికేషన్ విడుదల చేయగా అందులో 15 స్థానాల్లో వైఎస్సార్ సీపీ, 10 స్థానాల్లో టీడీపీ, రెండు స్థానాల్లో జనసేన మద్దతుదారులు పాగా వేశారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు, నిజశ్రవణ మాసం సందర్భంగా పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జామునుండే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.



బోనాలతో దర్శనానికి వస్తున్న భక్తులు



చేబ్రోలులో కొమ్మమూరు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, చిత్రంలో ఉమ్మారెడ్డి, కిలారి, డొక్కా తదితరులు

మేలు చేసే వారికే ఆదరణ

- శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- చేబ్రోలులో రూ.42.75 కోట్లతో నిర్మించనున్న కొమ్మమూరు బ్రిడ్జికి శంకుస్థాపన

చేబ్రోలు: ప్రజా సమస్యలు పరిష్కరించి మేలు చేసే వారికే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని మాజీ కేంద్రమంత్రి, శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు.
చేబ్రోలులోని గుంటూరు – చీరాల రోడ్డులో కొమ్మమూరు చానల్ (మద్రాసు కాలువ)మీద రూ.42.75 కోట్ల అంచనాతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. అనంతరం శిలాఫలకాన్ని ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా తదితరులు హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొమ్మమూరు చానల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి ఇన్నాళ్లకు మోక్షం కలిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వంతెన ప్రాధాన్యాన్ని వివరించి నిధులు తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే కిలారిని అభినందించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. గత ఎన్నికల ముందు నియోజకవర్గంలో ప్రధానమైన నాలుగు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చామని, అందులోభాగంగా కొమ్మమూరు చానల్‌పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు ఉప్పలపాడు –తక్కెళ్లపాడు గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారం, పొన్నూరు పట్టణంలోని జీబీసీ రహదారి విస్తరణ, పొన్నూరులో ఆటో నగర్ నిర్మాణానికి కృషి చేశామని వివరించారు. తెలుగు దుష్ప్రచారాల పార్టీ (టీడీపీ) అభివృద్ధిని అడ్డుకోవటానికి కుట్రలు, కుయుక్తులు పన్నుతోందని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలో గతంలో జరిగిన పనులు, వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని సూచించారు.
గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ తమ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు దిగ్విజయంగా అమలు చేస్తోందని వివరించారు. బెంగుళూరుకు చెందిన చాంపియన్ గ్రూపు చైర్మన్ హేమమాలిని మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణాన్ని ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు, గుత్తికొండ అంజిరెడ్డి, చేబ్రోలు, పొన్నూరు, పెదకాకాని మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్అండ్‌బీ అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఉత్సవ మూర్తి



అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన కుంకుమ పూజలను విశేషంగా జరిపించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో జరిగే ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తి వద్ద జరిగే లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శ్రావణ ప్రత్యేక కుంకుమార్చనతో పాటు మెట్ల పూజలను అధికంగా నిర్వహించారు. మరో వైపున దేవస్థాన యాగశాలలో నిర్వహించిన చండీహోమం, శాంతి కళ్యాణంలోనూ ఉభయదాతలు తమ నామగోత్రాలతో పూజలు చేయించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. దేవస్థాన ఘాట్‌రోడ్డుతో పాటు మహామండపం లిప్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 క్యూలైన్‌లో అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం మహానివేదన నిమిత్తం అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. భక్తులు, ఉభయదాతలతో పాటు శ్రావణ శుభముహూర్తాల వేళ ఒక్కటైన నవ దంపతులు పెళ్లి బట్టలపై ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకుని అమ్మవారి అన్న ప్రసాదాన్ని కుటుంబ సమేతంగా స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం పల్లకీ సేవలోనూ భక్తులు , ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం సూర్యోపాసన సేవ

లోక కళ్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు సేవలో పాల్గొన్నారు. సేవ జరిపించుకున్న భక్తులను ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

సజావుగా సీటెట్

- గుంటూరులోని తొమ్మిది కేంద్రాల్లో జరిగిన పరీక్ష
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహణ



పాటిబండ్ల సీతారామయ్య స్కూల్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీటెట్) ఆదివారం సజావుగా జరిగింది. గుంటూరు నగర పరిధిలోని తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన పరీక్షలకు జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. సీబీఎస్ఈ బోర్డుకు చెందిన ప్రతినిధులు స్వయంగా పరీక్ష కేంద్రాలను సందర్శించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పేపర్–1 పరీక్షకు దరఖాస్తు చేసిన 3,728 మంది అభ్యర్థుల్లో 2,195 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పేపర్–2 పరీక్షకు దరఖాస్తు చేసిన 2,430 మంది అభ్యర్థుల్లో 1,379 మంది చొప్పున హాజరయ్యారు. నగరంలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచి అభ్యర్థుల కోలాహలం మొదలైంది. ఆయా పరీక్షా కేంద్రాల ప్రధాన ద్వారం వద్ద అభ్యర్థుల హాల్ టికెట్ల నంబర్లతో రూమ్ నంబర్లు జాబితాను ప్రదర్శించారు. పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించే ముందు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

వైద్యవిద్యకు సాయం చేయండి

- దాతలను కోరుతున్న అన్నాచెల్లెళ్లు
- ఉక్రెయిన్ యుద్ధంతో అర్థంతరంగా ఆగిన చదువు
- కొనసాగింపునకు రూ.3.80 లక్షలు అవసరం



మౌనిక, మహేష్

తెనాలి: రష్యాతో ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో ఆ దేశంలో వైద్యవిద్యనభ్యసిస్తూ తిరిగి వచ్చిన తెలుగు విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సొంతూరు తెనాలి చేరిన అన్నాచెల్లెళ్లు మెడిసిన్ చదువు కొనసాగించడానికి ఆర్థిక సాయం కోసం దాతలను వేడుకుంటున్నారు. మనసున్న మా రాజులు స్పందించాలని కోరుతున్నారు.

ఆర్థిక పరిస్థితులు సహకరించక..

గుంటూరు జిల్లా తెనాలి చెంచుపేటకు చెందిన ప్రైవేటు టీచర్ నిడుముక్కల నాగేశ్వరరావుకు కొడుకు మహేష్, కూతురు మౌనిక ఉన్నారు. వీరు ఉక్రెయిన్‌లోని జెప్రోజి స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో మెడిసిన్ నాలుగో సంవత్సరం చదువుతుండగా 2021లో యుద్ధం మొదలైంది. దీంతో అదే ఏడాది సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వీరు స్వస్థలానికి చేరారు. అనంతరం ఆరునెలల పాటు ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యారు. యుద్ధ విరమణ జరిగే అవకాశం లేకపోవటంతో క్లాసులు ఆగిపోయాయి. వీరిద్దరినీ చదువు కొనసాగించేందుకు ఉక్రెయిన్ పొరుగుదేశమైన ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్ మెడికల్ యూనివర్సిటీకి బదిలీ చేశారు. 2022 సెప్టెంబరులో అక్కడకు వెళ్లి నాలుగో ఏడాది రెండో సెమిస్టర్‌లో చేరాల్సి ఉండగా, ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇప్పటికీ వెళ్లలేదు. ఇంటర్న్‌షిప్ ఎనిమిది నెలలతో కలిపి ఇంకా రెండేళ్లు చదవాలి. దీనికోసం ఒక్కొక్కరికి రూ.3.40 లక్షల చొప్పున మొత్తం రూ.6.80 లక్షలు ఖర్చవుతుంది.

ఇద్దరూ ప్రతిభావంతులే

మహేష్, మౌనిక ఇద్దరూ ప్రతిభావంతులే. టెన్త్‌లో మహేష్ 562 మార్కులు పొందగా, మౌనిక 9 జీపీఏతో ఉత్తీర్ణురాలైంది. ఇంటర్‌లో ఇద్దరూ 900పైబడి మార్కులు తెచ్చుకున్నారు. మెరిట్ ప్రాతిపదికగా టెన్త్, ఇంటర్‌లో ఉచితంగానే చదివారు. ఇంటర్ తర్వాత 2018లో నీట్ పరీక్షలు రాసినా బీ–కేటగిరీ (పెయిడ్)లో సీట్లు వచ్చాయి. ఏటా రూ.11 లక్షల ఫీజు చెల్లించలేని వీరిని ఉక్రెయిన్‌లో వైద్యవిద్య ఆకర్షించింది. లైసెన్సింగ్ పరీక్షలో మహేష్ 74 శాతం, మౌనిక 88 శాతం మార్కులు సాధించారు. మెడిసిన్ ఫస్టియర్‌లో 90 శాతం మార్కులతో కొంత స్కాలర్‌షిప్ కూడా లభించింది. కోవిడ్ వల్ల దానినీ ఆపేశారని మహేష్ చెప్పారు. దీంతో నాగేశ్వరరావు గణపవరంలో భార్యకు చెందిన 90 సెంట్ల స్థలాన్ని విక్రయించి పిల్లల చదువుకు ఖర్చుచేశారు. ఇక అమ్మటానికి సొంత ఇల్లు కూడా లేదు.

కొందరి సహృదయం

ఈ నేపథ్యంలో ఉజ్బెకిస్తాన్‌లో మెడిసిన్ కొనసాగింపునకు రూ.6.80 లక్షలు సమకూరటం దుర్లభమైంది. వీరి పరిస్థితి తెలిసిన దాతలు కొందరు రూ.3 లక్షల వరకు సాయం చేశారు. మరో రూ.3.80 లక్షల వరకు కావాల్సి ఉంది. దీంతో దాతలు సహకరించి తాము మెడిసిన్ చదివేందుకు తోడ్పడాల్సిందిగా మహేష్, మౌనిక అర్థిస్తున్నారు. వైద్యవిద్యలో స్థిరపడ్డాక తాము తీసుకున్న సాయానికి పదింతలు సమాజానికి మంచి చేస్తామని, ఆదుకోవాలని ఈ అన్నాచెల్లెళ్లు చేతులు జోడించి వేడుకుంటున్నారు.

ప్రతిభా ఫలం

ఉన్నత చదువుకు ఉపకారవేతనం

- ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు వరం
- ఎన్ఎంఎంఎస్ పరీక్ష ద్వారా ఎంపిక
- సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఎంపికైతే 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు ఏటా రూ.12,000



గుంటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిభే కొలమానంగా ఉపకార వేతనాలు దక్కనున్నాయి.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజ్ఞాశీలురైన విద్యార్థులను ఎంపిక చేసి, వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అర్హత ఆధారంగా ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. ఇందు కోసం ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హులు. పరీక్షలో ఎంపికైన వారికి 9,10,11,12వ తరగతుల్లో ఏడాదికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది.

ఎన్ఎంఎంఎస్‌కు అర్హతలు

- విద్యార్థులు 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించరాదు.
- విద్యార్థులు సెప్టెంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. పరీక్ష ఫీజు కింద ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చొప్పున చెల్లించాలి. ఇందుకు సంబంధించిన యూజర్ మాన్యువల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో ఉంది.

పరీక్ష విధానం

- పరీక్ష జాతీయస్థాయిలో జరుగుతుంది.
- మెంటల్ ఎబిలిటీ (మాట్), ఆప్టిట్యూడ్ (శాట్) అంశాల్లో ఒక్కో పేపర్‌కు 90 మార్కుల చొప్పున ప్రశ్నలు ఉంటాయి. 6,7,8 తరగతుల నుంచి ప్రశ్నలు వస్తాయి. 90 నిమిషాల్లో జవాబులు రాయాల్సి ఉంటుంది.

దరఖాస్తు విధానం

- విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా సెప్టెంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించేందుకు సెప్టెంబర్ 19వ తేదీ వరకు అవకాశం కల్పించారు. డిసెంబర్ 3వ తేదీన రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష జరగనుంది.

గతేడాది ఇలా..

గతేడాది నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో గతేడాది 450 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. వీరిలో గుంటూరు జిల్లాలో 145 మంది, పల్నాడు జిల్లాలో 181, బాపట్ల జిల్లాలో 124 మంది ఉన్నారు.

విద్యార్థులతో దరఖాస్తు చేయించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులతో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేయించాలి. ప్రభుత్వం నాలుగేళ్లపాటు అందించే ఉపకార వేతనాన్ని పొందే విధంగా విద్యార్థులను ప్రోత్సహించడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి.

– పి.శైలజ, డీఈఓ, గుంటూరు

న్యూస్‌రీల్

అభయ ప్రదాయినిగా బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ ఆలయంలో శ్రావణ మాసం మొదటి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహ మూర్తి పాల్గొన్నారు.

తిరుపతమ్మకు బంగారు గొలుసు



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ వారికి ఆదివారం గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, చిలువూరు గ్రామానికి చెందిన భావన హనుమంతరావు, శివనందిని దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి 8 గ్రాముల బంగారు బిళ్లలు కలిగిన నల్లపూసల గొలుసును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

నరసింహస్వామికి వెండి వస్తువుల బహూకరణ




జుజ్జువరం(పామర్రు): మండలంలోని జుజ్జువరంలో వేంచేసిఉన్న లక్ష్మీ నృసింహ స్వామి వారికి కంకిపాడు గ్రామానికి చెందిన కొప్పాక రాజేష్, రాధ దంపతులు రూ.1.40 లక్షల విలువ గల వెండి ఆభరణాలను ఆదివారం బహూకరించారు. 1.750 కేజీల బరువుల గల వెండి కిరీటం, కర్ణ పత్రాలు, శంఖ చక్రాలు, వక్షస్థలం, హస్తాలు, పాదాలను ఆలయ మేనేజర్ దుర్గా ప్రసాద్‌కు అందజేశారు. ఈ ఆభరణాలను ఆలయ అర్చకులు సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరించారు. అనంతరం స్వామికి విశేషంగా శత సహస్ర నామాలతో పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు



విజయవాడ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబలు అమ్మవారి ప్రసాదాలు, పట్టు వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 859.30 అడుగుల వద్ద ఉంది.

జొన్నలగడ్డలో జగనన్న మిల్క్ డెయిరీ ప్రారంభం



డెయిరీ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీపీ పులగం దివ్య తదితరులు

గుంటూరు రూరల్: పాడి పరిశ్రమ ద్వారా మహిళా రైతుల ఆర్థికాభివృద్ధికి జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జేపీ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డలో మండల పరిషత్ అధ్యక్షురాలు పులగం దివ్యశ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అమూల్ బల్క్ మిల్క్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు అనుబంధ విభాగాలు అభివృద్ధి చెందాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ మిల్క్ డెయిరీలను ప్రారంభించారన్నారు. ఎంపీపీ పులగం దివ్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులను వారి కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు పాడిపరిశ్రమల అభివృద్ధికి ఈ మిల్క్ డెయిరీలు ఎంతో ఉపయోగకరమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు మాట్లాడుతూ మహిళా రైతుల సాధికారతకు జగనన్న ప్రవేశపెట్టిన మిల్క్ డెయిరీలు వారి కుటుంబాల ఆర్థికంగా మెరుగుపడేందుకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శోభారాణి, గ్రామ సర్పంచి మబ్బు శిరీషసుధాకర్, ఈఓపీఆర్డీ కె.శ్రీనివాసరావు, ఉపసర్పంచి నామా శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచి వంగా నవీన్ రెడ్డి, స్థానిక నాయకులు ఆళ్ల పానకాలరెడ్డి పాల్గొన్నారు.

కార్డులు పంచివస్తూ మృత్యు ఒడిలోకి

ఇక రెండు రోజుల్లో వివాహం.. పెళ్లి పనులన్నీ మొదలైపోయాయి. అప్పటికే బంధువులు, తెలిసినవారందరికీ కార్డులు పంచి, ఆహ్వానాలు పలగ్గా, తన స్నేహితులు, సన్నిహితులకు స్వయంగా కార్డులిచ్చి, వివాహానికి ఆహ్వానించాలని తానే స్వయంగా బైక్‌పై బయల్దేరాడు ఆ పెళ్లికొడుకు. కూడా తన బంధువుల అబ్బాయిని వెంటబెట్టుకుని వెళ్లి, కార్డులు పంచేసి, వారిని తప్పకుండా పెళ్లికి రావాలంటూ మరీమరీ ఆహ్వానించి, సంతోషంగా ఇంటిబాట పట్టాడు. ఈలోపు మృత్యువు రవాణా వాహనం రూపంలో ఎదురవడంతో మరో రెండురోజుల్లో పెళ్లి పీటలెక్కాల్సిన ఆ యువకుడు అనంతలోకాలకు వెళ్లిపోగా, పదకొండేళ్ల బాలుడు మృత్యువుతో పోరాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అప్పటివరకు సరదా కబుర్లు, పెళ్లి హడావుడితో ఆనంద నిలయంగా ఉన్న పెళ్లికుమారుడి ఇల్లు శోకసంద్రమైంది.

రెండు రోజుల్లో పెళ్లి.. అంతలోనే అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- ఒకరి పరిస్థితి విషమం
- పెళ్లింట తీవ్ర విషాదం



మృతి చెందిన మహేష్ నాయక్

పిడుగురాళ్ల: బైక్‌ను రవాణా వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందగా, బాలుడి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన బుగ్గావత్ మహేష్‌నాయక్(27) ఈ నెల 23వ తేదీ తన పెళ్లికావటంతో బంధువైన 11 సంవత్సరాల మేఘావత్తు సామినీ గంగూనాయక్ అలియాస్ శివమణిని వెంటబెట్టుకొని తన బైక్‌పై కారంపూడి, పిడుగురాళ్లలోని బంధువులు, స్నేహితులకు కార్డులు ఇచ్చి తిరిగి మోర్జంపాడు వెళ్తుండగా పిల్లుట్ల రోడ్డులోని చంద్రపాలెం రోడ్డు సమీపంలో సున్నపు బట్టీల వద్దకు వచ్చేసరికి వేగంగా వచ్చిన రవాణా వాహనం ఢీకొనటంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. క్షతగాత్రులు ఇద్దరిని స్థానికులు పట్టణంలోని ఒక ప్రైవేటు హాస్పటల్‌కు తరలించారు. అప్పటికే మహేష్‌నాయక్ మృతి చెందాడు. మేఘావత్తు శివమణిని నర్సరావుపేట తరలించి అక్కడ ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు.

మృతుడి బంధువుల రాస్తారోకో..

అయితే చావు బతుకుల్లో ఉన్న తమ కుమారుడికి సరైన సమయంలో చికిత్స అందించడంలో పట్టణంలోని ప్రైవేటు హాస్పటల్ వాళ్లు నిర్లక్ష్యం వహించారంటూ అద్దంకి నార్కెట్‌పల్లి హైవేపై మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు రాస్తారోకో నిర్వహించారు. వెంటనే విషయం తెలుసుకున్న పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుని బంధువులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. అనంతరం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం శివమణి గుంటూరులో చికిత్స పొందుతుండటంతో బంధువులు కలిసి వెళ్లి శివమణి ఆరోగ్య వివరాలు తెలుసుకొని వచ్చారు. తండ్రి వాల్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పీవీ ఆంజనేయులు తెలియజేశారు.

శోకసంద్రం..

బుగ్గావత్ మహేష్‌నాయక్‌కు ఈ నెల 23వ తేదీన వివాహం జరగాల్సి ఉండగా పెళ్లి కార్డులు ఇచ్చేందుకు వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగింది. మూడు రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కుతాడు అనుకున్న కుమారుడు విగతజీవిగా పడి ఉండటంతో ఆ తల్లిదండ్రుల రోదన చూపరులను సైతం కంట తడి పెట్టించింది.

గుండెపోటుతో ఆంగ్లో ఇండియన్ మృతి

గుంటూరు రూరల్: గుండెపోటుతో ఆంగ్లో ఇండియన్ మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గోరంట్ల గ్రామంలోని హోసన్నా మందిర్ ఎదురు రోడ్డులో పార్క్ అర్కడ్ హాసిని ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్‌లో 103వ నంబర్ ఫ్లాట్‌లో ఆంగ్లో ఇండియన్ సిరిల్ బెర్నార్డ్ లెఫరి కుమారుడు కేవీన్ లాప్రె(58) ప్రస్తుతం ఒంటరిగా జీవిస్తున్నాడు. వీరు కొన్ని తరాల నుండి ఇండియాలో స్థిర పడి ఇండియాలోనే ఉంటున్నారు. ప్రస్తుతం ఆయన ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో చిలకలూరిపేటలో పనిచేస్తూ బెల్లంకొండ స్కూల్‌కి ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. గత 2 సంవత్సరాల నుంచి గోరంట్లలో ఇల్లు కొనుక్కొని ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. మూడేళ్ల నుంచి భార్యతో విడిపోయి ఉంటున్నాడని తెలిసింది. వీరికి పిల్లలు లేరు. శనివారం సాయంత్రం మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అపార్ట్ మెంట్‌లోని ప్రజలు 100కు సమాచారం అందించగా నల్లపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గత రెండురోజుల క్రితం తన చెల్లికి ఫోన్ చేసి గుండెల్లో నొప్పిగా ఉటుందని చెప్పినట్లు మృతుడి తమ్ముడు మిర్యాలగూడ సీఆర్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఫ్లాయిడ్ తెలిపారని పోలీసులు చెప్పారు. మృతుని తమ్ముడికి, పోలీసులు సమాచారం అందించారు.

రేషన్ పంపిణీలో నరసరావుపేట టాప్

- ద్వితీయ స్థానం చిలకలూరిపేట
- జిల్లాలో 87.58 శాతం మందికి పంపిణీ



ముప్పాళ్లలో పంపిణీని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ పద్మశ్రీ

నరసరావుపేట: రేషన్ బియ్యం, ఇతర నిత్యావసరాల పంపిణీలో ఈనెలలో నరసరావుపేట మండలం ప్రథమస్థానంలో నిల్చింది. జిల్లాలో 28 మండలాలు ఉండగా వాటి మొత్తంలో 87.58శాతం లబ్ధిదారులకు పంపిణీ చేయగా, నరసరావుపేట మండలంలో 93.17శాతం పంపిణీ జరిగింది. జిల్లా మొత్తం 1289 రేషన్‌షాపుల ద్వారా 402 ఎండీయూ వాహనాల సహాయంతో 6,36,802 మంది కార్డుదారులకు ఇంటింటికి సరఫరా చేయాల్సివుండగా ఈనెల 19వ తేదీ నాటికి 5,57,683మంది లబ్ధిదార్లకు నిత్యావసరాలు అందజేశారు. ఈనెల నుంచి పేదలకు రక్తహీనతను నివారించే ఫోర్టిఫైడ్ బియ్యంను మొదలు పెట్టారు. దీంతో పాటు పంచదార 3,92,179మందికి చేయగా, ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పట్టణాల్లోని 67,393మందికి పంపిణీ చేశారు. మండలాల వారీగా పంపిణీ శాతాన్ని పరిశీలిస్తే..చిలకలూరిపేట 91.38శాతం పంపిణీ జరగ్గా, యడ్లపాడు 87.16, నాదెండ్ల 89.06, దాచేపల్లి 89.54, గురజాల 87.73, మాచవరం 86.07, పిడుగురాళ్ల 90.15, దుర్గి 85.80, కారంపూడిలో 84.65, మాచర్ల 85.14, రెంటచింతల 86.91, వెల్దుర్తి 85.36, రొంపిచర్ల 83.26, అమరావతి 84.51, అచ్చంపేట 85.14, బెల్లంకొండ 85,28, క్రోసూరు 88.41, పెదకూరపాడు 85.49, ముప్పాళ్ల 87.44, నకరికల్లు 84.37, రాజుపాలెం 85.21, సత్తెనపల్లి 87.45, బొల్లాపల్లి 87.96, ఈపూరు 84.79, నూజెండ్ల 85.36, శావల్యాపురం 84.90, వినుకొండ 88.77 శాతం పంపిణీ చేశారు.

పంపిణీపై నిత్యం నిఘా

రేషన్ పంపిణీలో ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లోపంలేకుండా పేదలకు నిత్యావసరాలు పంపిణీ జరుగుతుంది. పంపిణీపై మా శాఖ అధికారులు నిత్యం నిఘా వేసి ఉంచాం.

– ఎస్.పద్మశ్రీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

దోమల లార్వాలను నిర్మూలించాలి

డీఎంహెచ్‌ఓ శోభారాణి



రోనాల్డ్ రేస్ చిత్రపటం వద్ద అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ శోభారాణి

నరసరావుపేట: ప్రజలు తమ ఇళ్లు, వాటి పరిసరాల్లో దోమల లార్వాలను గుర్తించి వాటిని నిర్మూలించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి రక్షణ పొందాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి కోరారు. ఆదివారం ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో మలేరియా పరాన్నజీవిని కనుగొన్న సర్ రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలని సూచించారు. సిబ్బందిచే దోమల సంతానోత్పత్తిచేసే లార్వాలను సమూలంగా నిర్మూలిస్తామని, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటిస్తామని, ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామని, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించటంలో తమ వంతు పాత్ర పోషిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకా నియంత్రణాధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్రరత్నాకర్, ఏఎన్‌ఓ సీహెచ్.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏడు మండలాల్లో వర్షపాతం నమోదు కాగా.. అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 6.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.2 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కాకుమాను 6.4, పొన్నూరు 3.2, చేబ్రోలు 3, పెదనందిపాడు 1.4, గుంటూరు పశ్చిమలో 0.6 మి.మీ చొప్పున వర్షం పడింది. జిల్లా మొత్తం సగటున 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు మాసం సాధారణ వర్షపాతం 164.7 మి.మీ ఉండగా, ఇప్పటి వరకు 81 మి.మీ వర్షపాతం నమోదైంది.

నకిలీ బంగారం కేసులో కొనసాగుతున్న విచారణ!

గురజాల: నకిలీ బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి రుణాలు తీసుకునేందుకు ప్రయత్నించిన నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు. కేరళకు చెందిన ఆ యువకుడిని శనివారం అదుపులోకి తీసుకున్న విషయం పాఠక విధితమే. బ్యాంకులో ఇంకా ఏమైనా నకిలీ బంగారం పెట్టి రుణాలు పొందాడా, ఈ వ్యవహారంలో ఇంకా ఎవరిపాత్రయినా ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

26న మెగా జాబ్ మేళా

మాచర్ల: మాచర్లలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 26వ తేదీన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ మెగా జాబ్‌మేళా నిర్వహించటం జరుగుతుందని మేనేజర్ రామాంజనేయులు, ప్లేస్‌మెంట్ అధికారి రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. వివిధ బహుళజాతి సంస్థల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పల్నాడు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ప్రిన్సిపాల్ కుర్రి సాయి మార్కొండారెడ్డిలు పాల్గొంటారన్నారు. 18–30 ఏళ్ల లోపు వారు ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లమో చేసిన వారు అర్హులన్నారు. పల్నాటి ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై బ్రహ్మరటౌన్ షిప్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ పట్టణం మరగాయకుంటకు చెందిన షేక్ మస్తాన్‌వలి(35) ప్రకాశం జిల్లా మారివేముల గ్రామానికి చెందిన సోములు వెంకటేశ్వరరెడ్డి ఇరువురు ద్విచక్ర వాహనంపై కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తుడంగా వినుకొండ వైపు నుంచి వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈప్రమాదంలో మస్తాన్‌వలి అక్కడిక్కడే మృతి చెందగా వెంకటేశ్వరరెడ్డికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రేపల్లె: అప్పుల బాధతాళ్లలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ నజీర్‌బేగ్ తెలిపారు. పేటేరు గ్రామానికి చెందిన పోస్ట్‌మెన్ గంటా శ్రీనివాసరావు(48) ఆదివారం ఉదయం అరవపల్లి రోడ్డులోని ఒక రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారని చెప్పారు. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని శ్రీనివాసరావును పరిశీలించగా అప్పటికే మృతి చెందాడన్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. అప్పుల బాధలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నాలుగేళ్లగా యూఎస్‌ఏ- ఐలవరం విద్యార్థుల పెన్‌పాల్

ఐలవరం(భట్టిప్రోలు): యూఎస్ఏలోని నెంబ్రస్కా రాష్ట్రంలోని రీగన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నాలుగేళ్లుగా పెన్‌పాల్ (ఉత్తర ప్రత్యుత్తరాలు) నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఐలవరం విద్యార్థులు పంపిన ఉత్తరాలు నెంబ్రస్కాలోని పాఠశాలకు చేరాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల వ్యాకరణ సామర్థ్యం మెరుగు పడటమే కాక తమ తమ సంస్కృతి సంప్రదాయాలు, విద్యా విధానం గూర్చి తెలుసుకునే అవకాశం లభిస్తుంది. కార్యక్రమాన్ని రీగన్ పాఠశాల ఉపాధ్యాయులు టామ్ విజ్‌నెండ్, ఐలవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు పి.హరికృష్ణ నిర్వహిస్తున్నారు.

మొక్కు తీర్చుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదం

అద్దంకి రూరల్: కుటుంబ సభ్యులంతా కలసి సంతోషంగా దేవుడి మొక్కు తీర్చుకొని వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. నలుగురు గాయపడ్డారు. ఈఘటన ఆదివారం అద్దంకి పట్టణం దర్శి రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికుల అందించిన వివరాలు.. జిల్లా దర్శిలోని ఏకలవ్య నగర్ కు చెందిన బత్తుల సురేష్‌బాబు కుటుంబ సభ్యులు 11 మంది బల్లికురవ మండలంలోని గొర్రెపాడులో అంకమ్మతల్లి దేవస్థానంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆటోలో వచ్చారు. అమ్మవారి మొక్కులు తీర్చుకుని తిరిగి సాయంత్రం ఆటోలో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలోని అద్దంకిలోని దర్శి రోడ్డుకు రాగానే వెనుకకు రివర్స్ చేసుకుంటున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నడుపుతున్న బత్తుల సురేష్‌కు ఆయన తల్లి సులోచనా దేవికి కుమారుడు కృష్ణతేజకు, తమ్ముడు కుమారుడు మహేష్‌బాబుకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన కుటుంబ సభ్యులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108లో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో అపస్మారక స్థితిలో ఉన్న మహేష్‌బాబును ముందుగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తరువాత క్షతగాత్రులు సురేష్‌బాబు, సులోచనాదేవి, కృష్ణతేజలకు ప్రథమచికిత్స అందించి ఒంగోలుకు తరలించారు.

బాలికను మోసగించిన యువకుడిపై పోక్సో కేసు

ప్రత్తిపాడు: బాలికకు మాయ మాటలు చెప్పి, నమ్మించి గర్భిణిని చేసిన ఓ యువకుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదయింది. ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన ఒక కుటుంబం సుమారు పది సంవత్సరాల కిందట, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామానికి కూలి పనుల నిమిత్తం వలస వచ్చింది. అక్కడే నివాసం ఉంటూ, కూలి పనులు చేసుకుంటూ వారి ముగ్గురు ఆడపిల్లలను పోషించుకుంటున్నారు. పెద్ద కుమార్తె(14) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన రాజుపాలెం రామకృష్ణ(27) నిత్యం క్రికెట్ ఆడేందుకు పాఠశాల క్రీడా మైదానానికి వస్తుంటాడు. ఈ క్రమంలో బాలికతో రామకృష్ణకు పరిచయడం ఏర్పడింది. ఈక్రమంలో ఒక రోజు శివారులో ఉన్న రేగితోటలోనికి తీసుకుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం కొంత కాలానికి బాలిక తండ్రి చనిపోవటంతో వారు తిరిగి వారి స్వగ్రామమైన దొండపాడుకు వెళ్లిపోయారు. అయినప్పటికీ రామకృష్ణ, దొండపాడులో ఉంటున్న బాలిక వద్దకు తరుచూగా వెళ్లేవాడు. ప్రస్తుతం బాలిక గర్భం దాల్చడంతో బాలికతో పాటు తల్లిదండ్రులు ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించారు. బాలిక లిఖితపూర్వకంగా శనివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్ర బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రాగా ముగిసిన గుంటూరు, ప్రకాశం మ్యాచ్

- డబుల్ సెంచరీ సాధించిన గుంటూరు కెప్టెన్ దేవ్ ప్రమోద్
- సెంచరీ సాధించిన ప్రకాశం బ్యాట్స్‌మెన్ గిరీష్




దేవ్‌ప్రమోద్, 203 పరుగులు



గిరీష్, 100 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్ –16 బాలుర సెంట్రల్‌జోన్ మూడురోజుల టెస్ట్ మ్యాచ్‌లో భాగంగా గుంటూరు, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. శనివారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 263 పరుగులతో ఆదివారం బ్యాటింగ్ ప్రారంభించిన గుంటూరు జట్టు మరో రెండు వికెట్లు కోల్పోయి 364 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. సెంచరీ హీరో గుంటూరు కెప్టెన్ ఆదివారం కూడా తన జోరును కొనసాగిస్తూ డబుల్ సెంచరీ సాధించి 203 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ప్రకాశం జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 171 పరుగులు చేసింది. జట్టులోని గిరీష్ సెంచరీ సాధించి నాటౌట్‌గా నిలవగా, మరో బ్యాట్స్‌మెన్ సంతోష్ 52 పరుగులతో అర్ధ సెంచరీ నమోదు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన గుంటూరు జట్టుకు 3 పాయింట్లు, ప్రకాశం జట్టుకు 1 పాయింట్ లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

బీసీ గర్జనకు అధిక సంఖ్యలో తరలి రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నియోజకవర్గ పద్మశాలీయ సంఘ నాయకులతో సమావేశం

సత్తెనపల్లి: నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 22న సత్తెనపల్లిలో జరిగే బీసీ గర్జనకు పట్టణం నుంచి బడుగు, బలహీన వర్గాలు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ కార్యాలయంలో పద్మశాలి సంఘం నియోజవర్గ స్థాయి నేతలతో 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పట్టణంలో పద్మశాలీలకు రెండు కౌన్సిలర్ స్థానాలు ఇవ్వగా, 2 విజయవంతంగా గెలుచుకొని పార్టీకి అండగా నిలిచారన్నారు. మీ అందరి సహకారంతో అధిక సంఖ్యలో ఈ నెల 22న శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగే బీసీ గర్జన సభకు విశేష సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ సామాజిక వర్గానికి, పద్మశాలీలకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. నియోజకవర్గంలో నిమ్మకాయల రాజనారాయణకు, నాగార్జున యాదవ్ కు అత్యంత కీలకమైన రెండు నామినేటెడ్ చైర్మన్ పదవులను కేటాయించడం బీసీ సామాజిక వర్గానికి జరుగుతున్న సన్మానంగా భావించాలని కోరారు. మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టి క్షేత్రస్థాయిలోనే ప్రజలకు అవసరమైన అన్ని వసతులు, అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత కల్పించిందన్నారు. నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీ సామాజికవర్గాలకు ఎన్ని సీట్లు కేటాయించారు, బీసీలకు ఇస్తున్న ప్రాముఖ్యతను గురించి, కార్పొరేషన్ల పదవుల గురించి క్షుణ్ణంగా వివరించారు. సమావేశంలో 18వ వార్డు కౌన్సిలర్ కాకుమాను రవి, మాజీ కౌన్సిలర్ దుగ్గి భద్రయ్య, గాత్రం కోటేశ్వరరావు, గంజి శ్రీనివాసరావు, అనుముల పాపారావు, పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.